# సంగీత స్వర సామ్రాట్ మన బాలు

నేటినిజం
ఆదివారం 27-9-2020

బాలు భౌతికంగా లేకపోయినా..ఆయన పాట చిరస్థాయిగా మన మదిలో ఉంటుంది. ఆయన గురించి ఎంతగా మాట్లాడుకున్నా, ఎంతగా చర్చించుకున్నా అది సముద్రంలో నీటిబిందువంతే అవుతుంది. కానీ మనమధ్య ఆయన లేడన్నదే ప్రతి ఒక్కరి బాధ. బహుశా గానగంధర్వుడు బాలు లేడన్న బాధను ఆయన పాటను ఆస్వాదించిన అన్ని కుటుంబాలు అనుభవిస్తున్నాయి. ఆయనను స్వయంగా కలుసుకోలేని వారు సైతం తమకు బాలుతో అనుబంధం ఉందన్న బాధలో ఉన్నారు. అన్ని భాషల వారు ఆయనను అమితంగా ప్రేమిస్తారు. అన్ని భాషల్లో ఆయన అంతగా మెప్పించి ఉండకుంటే ఇంతటి అభిమానం దక్కించుకునే వారు కాదు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ వదిలి పోయాక మన బాలూ మనలను వీడి పోయారు. సంగీత ప్రపంచంలో ఎందరు కొత్తవారు వచ్చినా ఇంతటి మహానుభావులు వస్తారనుకోవడం అత్యాశే కాగలదు. ఓ ఘంటసాల, ఓ ఏఎం రాజా ఇలా చెప్పుకుంటూ పోతే ఎవరి ధోరణి వారిదే. అలానే బాలు ధారణ ఆయనదే. ఆయన మనకు దక్కిన అపూర్వ వరం. అందుకే ప్రజలు ఇంతగా బాధపడుతున్నారు. ఇంతటి అభిమానాన్ని పొందిన గాయకుడు బహు అరుదు. ఆయన మన తెలుగు వాడైనందుకు మనమంతా గర్వించాలి.కరోనా విజృంభించిన వేళ ఎందరో మృత్యువాత పడుతున్న వేళ..చైనా వదిలిన కనపడని శత్రువు కరోనా వైరస్ కారణంగా ఓ మహోన్నతుడిని ప్రపంచం కోల్పోయింది.గాన సీమకు రారాజుగా పేరొందిన మన బాలు ఇక కరోనాతో పోరాడలేక దివికేగిన తీరు భారతీయ హృదయాలను కలచి వేస్తోంది. బాలు లేని భారతీయ సంగీత ప్రపంచమే శోకిస్తోంది. పరవశాన శిరసాగగా... ధరకు జారెనా శివగంగా...అన్న గొంతుక ఇక అమరత్వం పొందింది. అమరలోకంలో అది అజరామరంగా నిలవనుంది. ఆయన ఓ రికార్డింగ్ కోసం రాకుండా ఉండిఉంటే కరోనా అనే మమమ్మారి బారిన పడేవారు కాదేమో. అంతటి మహానుభావుడిని పొట్టన పెట్టుకున్న కరోనాను తరిమి కొట్టేందుకు మనమంతా సంకల్ప బద్దం కావాలి. అత్యంత జాగ్రత్తగా ఉండాలి. బాలసుబ్రమణ్యం ఎంతటి గాయకుడో అంతటి దాయార్ద్ర హృదయుడు. తనకన్నా జూనియర్లను కూడా పాదాభివందనం చేసే గొప్ప మనసు ఆయనది. ఓ సందర్భంలో అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు శబరిమల వెళ్లిన సందర్భంగా కొండపైకి వెళ్లడానికి డోలీ ఎక్కాల్సి వచ్చింది. దీనికి ముందు ఆయన డోలీ మోసే కూలీలకు పాదాభివందనం చేసి..తన మహోన్నతను చాటుకున్నారు. నిజంగా ఇంతటి మహోన్నత భావుడు మనముందు నడయాడినందుకు మనమంతా గర్వించాలి. బాలసుబ్రహ్మణ్యం తనకుతాను ఎప్పటికీ విద్యార్థిగా పరిగణించుకునేవారు. తానో నిత్య విద్యార్థినే అనుకునేవారు. ఎవరైనా బాగా పాడితే ఆనందించేవారు. అందుకే శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం భారతీయ సంగీత వైభవ పతాకగా నిలిచారు. చలన చిత్ర గీతాలాపనకు సంబంధించిన గీతను చెరిపేసిన నవీన గీతాచార్యుడు. రామారావు నుంచి రాజబాబు వరకూ శంకరాభరణం నుంచి వంకర టింకర గొంతు వరకూ అన్నిటినీ అపురూపంగా పాడి అలరించిన గానగంధర్వుడు ఆ మహానుభావుడు. 16భాషలో పాడడం వల్ల ఆయన అందరివాడిగా నిలిచారు. సాంకేతిక సామాజిక మార్పులను ఆకళింపు చేసుకుని పాటలకు స్వరాభిషేకం చేశారు. పాడుతూ తీయగా తన పాట మన గుండెలో పలికిస్తూ వెళ్లిపోయినా..చిరస్థాయిగా ప్రతి ఇంటా నిత్యం నానుతూనే ఉంటారు. పాటను ప్రాణంగా చేసుకున్న సాహిత్య ప్రియుడుగా మానవతా భావుకుడిగా బహువిధాలు తెలుగు ప్రజల దైనందిన జీవితంలో భాగమై నిత్యం నిలుస్తాడనడంలో సందేహం లేదు. సాహిత్యంపై అమితమైన మక్కువతో పాటు పట్టు ఉండడంతో బాలు రచయిత ఉద్దేశించిన భావాన్ని అభినయించే నటుల మ్యేనరిజాన్ని మేళవించి పాడటం కొత్త వరవడిగా మారింది. శంకరాభరణంలో శాస్త్రీయ సంగీత గీతాలాప నతో జాతీయ పురస్కారాలు పొందడం ఆయనను కొత్త శిఖరాలకు చేర్చింది. తెలుగు సినిమా పాట అంటే బాలు అన్నట్టు పరిస్తితి తయారైంది. ఒక్కడే అన్నీ పాడుతున్నాడన్న విమర్శలు వచ్చినా నిర్మాతలు ప్రేక్షకులు చిరంజీవి వంటి కొత్త హీరోలు కూడా ఆయననే ఎంచుకోవడం అన్నది బ ఆలుమీద ఉన్న అభిమానంతో పాటు..పాటకు ప్రాణం పోయాలన్న తపన కూడా ఇమిడి ఉంది. పాడుతా తీయగా కార్యక్రమంలో పిల్లను ప్రోత్సహించే సమయంలో ఆనాటి సంగతులు అనేకం చెబుతూ మనకు గత స్మృతులను గుర్తు చేసిన తీరు మరవలేనిది. కాలంలో మార్పునూ సాంకేతిక ప్రక్రియనూ ఆకళింపు చేసుకుంటూ సవాళ్లను అధిగమించి సంకల్ప బలం చాటుకున్నారు. తన తొలి గురువు కోదండపాణి పేరిట రికార్డింగ్ స్టూడియో కడితే ప్రేరణగా నిలిచిన ఘంటసాల విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆయనమీదున్న గౌరవం చాటుకున్నారు. తన సంగీత కార్యక్రమాలలోనూ పాత తరం కళాస్రష్టను జానపద ప్రజా కళాకారులనూ గౌరవంగా పరిచయం చేయడం కూడా తన వినమ్రతను చాటుతుంది. జాతీయ అవార్డు నంది పురస్కారాలు బాలుకు లెక్కకు మిక్కుటంగా రావడానికి తన నిరంతర సాధన తపనలే కారణం. గొప్పవారు కళాకారులు కన్నుమూసినప్పుడు కలిగే బాధను మించి ను దిక్కు నుంచి గుండెలోకి దూసుకొచ్చే బాలు కంఠస్వరం కన్నీళ్లు తెప్పిస్తుంది. ప్రతి ఇంట్లోనూ స్వంత మనిషిని కోల్పోయామనేంతగా కలచివేస్తుంది. మనిషి పోతే మాత్రమేమి మనసు వుంటది అని ఘంటసాల పాడినట్టు, నువ్వులేవు నీ పాట వుంది అని తిలక్ అన్నట్టు బాలు మనలో నిలిచే వుంటారు. పాట ఉన్నంతవరకు బాలు ఉంటారు. బాలు నిరంతరాయంగా మన ఇంట్లో నడయాడుతుంటారు. ఆయన నడయాడిన ఈ నేల ఎంతపవిత్రమో..ఆయన గాత్రం అంత పవిత్రం. ఆయన సంగీతం అజరామరం. ఆయన అందించిన పాటలు వేనవేలు మనకు ఓ వరం. ఆయన పాటలు వింటూ మనమంతా హాయిగా ఉండేలా చేసిన బాలసుబ్రమణ్యం చిరంజీవే కాక ధన్యజీవి కూడా.

## పెరుగుతున్న కరోనా కేసులతో ఆందోళన

### ఉమ్మడిగా కట్టడి చర్యలు తీసుకోవాలి
### ప్రపంచ దేశాలకు ఆరోగ్యసంస్థ హెచ్చరిక

జెనీవా,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. యూరోప్ దేశాల్లో కొత్తగా నమోదు అవుతున్న పాజిటివ్ కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మళ్లీ వార్నింగ్ ఇచ్చింది. కోవిడ్-19 మహమ్మారి తీవ్రత పై ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారులు మరోసారి ప్రపంచ దేశాలను హెచ్చరించారు. సమిష్టి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరణాల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే కరోనాను కట్టడి చేసేందుకు వాక్సిన్ అవసరంపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. సత్వర చర్యలు, వాక్సిన్ రాని పక్షంలో కరోనా మరణాల తీవ్రత పెరుగుతుందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది.వైరస్ నియంత్రణకు సరైన చర్యలు తీసుకోకుంటే.. కోవిడ్ మరణాలు 20 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని డబ్ల్యూహెచ్వో ఎమర్జెన్సీ డైరక్టర్ మైఖేల్ ర్యాన్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకు 9,85,707 మంది వైరస్ వల్ల మరణించారు. మొత్తం 32.3 మిలియన్ల పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. అమెరికాలో అత్యధికంగా 70 లక్షలకు పైగా పాజిటివ్ కేసులు ఉన్నాయి. పది లక్షల మరణాలు సంభవించడం పెద్ద సంఖ్యే అని, అయితే ఆ మరణాల సంఖ్య పెరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మైఖేల్ ర్యాన్ తెలిపారు. యూరోప్‌లోని స్పెయిన్, పోల్యాండ్, ఫ్రాన్స్ దేశాల్లో కొత్త కేసులు నమోదు కావడంతో అక్కడ మళ్లీ లాక్‌డౌన్ విధించారు. బ్రిటన్‌లో కూడా అనేక ప్రాంతాల్లో ఆంక్షలను కొనసాగిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు అంటూ రష్యా ప్రజలకు ఆదేశాలు జారీ చేశారు. బ్రెజిల్‌లో సాంప్రదాయ కార్నివల్ వేడుకలను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రమాదాన్ని ఊహించడానికే కష్టంగా ఉందని, దీన్ని పరిగణనలోకి తీసుకొని సంబంధిత చర్యలు తీసుకోవాలని ర్యాన్ కోరారు.

## బాలుతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సుశీల

### -కరోనా బాలును తీసుకుని పోయిందని కన్నీటి పర్యంతం

చెన్నై,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ):16 భాషలలో 40వేలకు పైగా పాటలు పాడిన స్వర జ్ఞాని ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మరణం ప్రతి ఒక్కరికి తీరని విషాదాన్ని మిగిల్చింది. బాలుతో కలిసి పని చేసిన వారు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. బాలుతో కలసి ఎన్నో సినిమాలకు అద్భుతమైన పాటలు ఆలపించిన సుశీల ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

సంగీత ప్రపంచానికి ఎంతో మేలు చేసిన బాలుని కరోనా మహమ్మారి వెంటాడి వెంటాడి వేధించి తీసుకుపోయిందని సుశీల భావోద్వేగానికి గురయ్యారు. కరోనా ఇంత అలజడి రేపుతుందని అనుకోలేదంటూ ఆమె సంతాపం ప్రకటించారు.మనందరి ఆప్తుడిని తీసుకుపోయి ఒక పెద్ద అగాధంలోకి తోసేసిందన్నారు. ప్రపచవ్యాప్తంగా అభిమానులందర్నీ తీరని దుఃఖ సముద్రంలోముంచేసిందంటూ ఆమె కంటతడిపెట్టారు. గుండె ధైర్యం తెచ్చుకుని, విషాదంనుంచి కోలుకోవాలని, అభిమానులకు సూచించారు.

## శ్రావణి ఆత్మహత్య కేసు

### -పోలీస్ కస్టడీకి సాయికృష్ణ, దేవరాజ్

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): బుల్లితెర నటి శ్రావణి ఆత్మహత్య కేసులో నిందితులైన సాయికృష్ణ, దేవరాజ్‌ను ఎస్సార్‌నగర్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. శ్రావణి ఆత్మహత్యకు దారితీసిన ఘటనను సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్నారు. శ్రావణి ఆత్మహత్యకు ముందు శ్రీకన్య హోటల్‌లో సాయి, దేవరాజ్, శ్రావణి మధ్య గొడవ జరిగింది. ఆత్మహత్యకు ముందు ముగ్గురి సెల్ సిగ్నల్స్ ఆధారంగా విచారణ చేపట్టనున్నారు. ప్రేమ పేరుతో శ్రావణిని సాయి, దేవ్‌రాజ్ మోసం చేశారు. ఈ కేసులో లభించిన ఆడియోలు, వీడియోల ఆధారంగా పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నారు.

## పూర్తిస్థాయికి సాగర్ జలాశయం

### -పదిగేట్లు ఎత్తిన అధికారులు

నల్లగొండ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ఎడతెరపి లేని వర్షాల కారణంగా ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలోని ప్రాజెక్టులన్నీ నిండు కుండల్లా మారాయి. దీంతో దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే నీటికి తోడు వరద నీరు కూడా భారీగా వచ్చి చేరుతుండటంతో నాగార్జున సాగర్ కూడా నిండుకుండలా మారింది.

నాగార్జున సాగర్ మొత్తం పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 589.30 అడుగులకు చేరింది. అదేవిధంగా సాగర్ మొత్తం నీటి నిలువ సామర్థ్యం కూడా 312.05 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిలువ 309.95 టీఎంసీలకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో అధికారులు శనివారం డ్యామ్‌లోని 10 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర పైకిఎత్తారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు పరుగులు తీస్తున్నది.

### నడిగూడెం చెరువుకు అలుగు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా నడిగూడెం మండల కేంద్రంలో భారీగా వరదనీరు చేరింది. నీటికి నడిగూడెం చౌదరి చెరువు నిండి అలుగు పోస్తోంది. దీంతో గ్రామం జలమయమైంది. పలు ఇళ్లలోకి వరద నీరు చేరుకుంది. నీట మునిగిన సామాగ్రి.. గ్రామస్తులు ఇళ్లలోనే ఉండిపోయారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు రక్షణ సహాయ చర్యలు చేపట్టారు.

## గురుకుల ప్రవేశాలకు 30నుంచి దరఖాస్తులు

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో ఆరవ, ఏడో తరగతి ప్రవేశాలకు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 9 వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 8 ఏకలవ్య గురుకుల పాఠశాలలున్నాయి. పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రవేశం కల్పించనున్నారు.

# ప్రయోగాలు చేయడంలో బాలు దిట్ట

### నటుడికి అనుగుణంగా గొంతు సవరించి పాడిన ఏకైక గాయకుడు

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): 'ఆకాశం నుంచి నా కోసం వచ్చావా' అని రాజబాబుకు తమాషాగా పాడిన బాలసుబ్రమణ్యం పాట ట్రెండ్ సెట్టర్ అయింది. అలాగే ముత్యాలూ వస్తావా అన్న పాట కూడా అంతగా హిట్టయ్యింది. అప్పటికే ఘంటసాల అస్వస్థులైనారు. అల్లూరి సీతారామరాజులో తెలుగు వీర లేవరా పాట బాలుతో పాడించుకోమని ఘంటసాలే కృష్ణకు సలహా ఇచ్చారు. బాలుపై నమ్మకంతో ఘంటసాల బాలును ఎంతగానో ప్రోత్సహించారు. అరవయ్యవ దశకం నాటికి తెలుగు సినిమాలో ఎన్టీఆర్, ఏఎన్నార్‌కు ఘంటసాల 95 శాతం పాటలు పాడితే కాంతారావు హరనాథ్ వంటివారికి పిబిశ్రీనివాస్ పాడేవారు. కొత్తగావస్తున్న శోభన్‌బాబు, కృష్ణ వంటివారి విషయంలో మిశ్రమంగా వుండేది. కమెడియన్లకు పిఠాపురం,మాధవపెద్ది ఎక్కువగా పాడేవారు. కోదండపాణి ప్రోత్సాహంతో తొలిసారి పద్మనాభం చిత్రంలో పాటపాడిన బాలు కృష్ణ చిత్రాలకు అత్యధిక గీతాలు పాడేవారు. ఆయన తన పాత్రకు విభిన్నమైన గొంతువుంటే మంచిదని భావించడంతో పాటు ప్రతిభాశాలికి నిలదొక్కుకోవడానికి తోడ్పడాలనుకున్నారు. అప్పట్లో ఆయన చిత్రాలు సంఖ్య కూడా చాలా ఎక్కువగా వుండేది గనక పాటలు ఎక్కువగానే వచ్చేవి. అయితే బాలు గొంతు అలాటి యువతకు సరిపోవచ్చు గాని, అగ్రనటులు ఎన్టీఆర్ ఏఎన్నార్‌కు ఘంటసాలే పాడాలనుకునేవారు. ఎన్టీఆర్ మహమ్మద్ రఫీతో కూడా ప్రయోగాలు మొదలు పెట్టారు. భలే తమ్ముడు, ఆరాధన వంటి సినిమాల్లో రఫీతో పాడించారు. అక్కినేని రామకృష్ణకు అవకాశాలు ఇస్తున్నారు. శోభన్‌బాబు కూడా రామకృష్ణతోనే పాడించుకోవడం మొదలెట్టారు. ఈ దశలో జేమ్స్‌బాండ్ తరహా చిత్రాల్లో బాలు పాప్ తరహా ప్రయోగాలు చేయగలిగారు. కలెక్టర్ జానకిలో కుచేలుడి పేరుతో కుటుంబ నియంత్రణ చెప్పే ఆధునిక హరికథ వంటివి బాలు ప్రత్యేకతను చాటాయి. ఆయన తర్వాత అగ్రనటులకు ఎవరు పాడతారన్న సందేహాలు కూడా వుండేవి. వాటన్నిటినీ పటాపంచలు చేశారు బాలు. దాసరి మనుషులంతా ఒక్కటే లో ముత్యాలువస్తావా అని అల్లూరి రామలింగయ్యకూ, అనుభవించు రాజా అని ఎన్టీఆర్‌కు కూడా పాడి మెప్పించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.'కృషి వుంటే మనుషులు రుషులవుతారు' అని అడవిరాముడులో పాడినట్టు బాల సుబ్రహ్మణ్యం జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగింది. అక్కినేనికి ప్రేమాభిషేకంలో ఆగదు ఏ నిముషం నీ కోసమూ వంటి పాటలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఒక దశలో బాలు ఎంత తీరికలేకుండా గడిపారంటే రోజుకు 24 గంటుంటే ఆయన 21 పాటు పాడి రికార్డు సృష్టించాడు. మొదటి పాట పాడిన కొద్ది రోజులోనే కన్నడ తమిళ భాషలోనూ గానం చేశారు. కోదండపాణి, మహదేవన్, సత్యం వంటివారి నుంచి ఇళయరాజా, ఎఆర్ రహమాన్ వరకూ ఈ సంగీత ప్రస్థానం కొనసాగింది. వీరు మొదట ఆయన దగ్గరే పనిచేసిన వారు కావడం మరో అద్భుతం. ఈ కాలంనే కమల్‌హాసన్, రజనీకాంత్ వంటివారికి డబ్బింగ్ చెప్పడం వారి ఘన విజయానికి దోహదం చేసింది.ఉత్తరోత్తరా అది ఉప వ్యాపకమైంది. దక్షిణాది భాషతో పాటు హిందీలోనూ హిట్స్ ఇచ్చిన బాలు ఏక్‌దుజేకిలియే(మరో చరిత్ర)తో జాతీయ పురస్కారం పొందడం అరుదైన చరిత్ర. అందుకే ఆయన భారత సుబ్రహ్మణ్యం అయ్యారు. 40 వేల పాటు పాడి గిన్నీస్ బుక్‌కెక్కిన ఆయన బోలెడన్ని పాత్రలు ధరించడం, చిత్రాలు నిర్మించడం బహుముఖీనతకు అద్దం పడతాయి. సంగీత దర్శకత్వం సరేసరి. తన శుభసంకల్పంతో విశ్వనాథ్‌ను తెరమీదకు తెచ్చింది కూడా బాలునే. ఇదే కాలంలో అనర్గళ వ్యాఖ్యాతగా సంగీత కచేరిను ఆధునికం చేసి దేశవిదేశాలో ఎందరికో స్ఫూర్తినీ ఉపాధినీ ఇచ్చారు. 2000 తర్వాత క్రమేణా పరిశ్రమలో మార్పు తర్వాత మరోతరం యువత ప్రధాన పాత్రలోకి వచ్చాక బాలు సినిమాకు పాడటం క్రమేణా తగ్గింది. అయితే అదే సమయంలో టీవీలో స్వరాభిషేకం వంటి కార్యక్రమాతో కొత్త తరాలకు స్వరధారను అందించారు. వాటిని సమయస్ఫూర్తితో ఉత్తేజకర జ్ఞాపకాతో చమత్కారాతో నిర్వహిస్తూ విజయవంతం చేశారు.

# ప్రజారోగ్యం బాధ్యత నుంచి కేంద్రం తప్పుకుంటోందా?

### నీతి ఆయోగ్ సిఫార్సులు బేఖాతర్ అవుతున్నాయా
### డిజిటల్ విధానాలు కార్పోరేట్ అనుకూలంగా ఉన్నాయా

న్యూఢిల్లీ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ప్రజారోగ్యం పట్ల తన బాధ్యత నుండి తప్పుకోవడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఉంటోంది. నీతి ఆయోగ్ సిఫార్సులు బేఖాతర్ అవుతున్నాయి. ఆరోగ్యం మానవ హక్కులలో ఒకటి అన్న వాస్తవాన్ని పూర్తిగా మరుగు పరుస్తున్నారు. వైద్యాన్ని వ్యాపార సరుకుగా చేసి ఆ మార్కెట్‌ను మొత్తంగా కార్పొరేట్ల చేతుల్లో, బహుళజాతి విదేశీ ఫార్మా కంపెనీల కబంధ హస్తాల్లో పెడుతున్నారు.అది చాలదన్నట్టు మన దేశ పౌరుల వ్యక్తిగత డేటాను కూడా వారికే అందిస్తూ మన గోప్యత హక్కును కాలరాస్తున్న తీరు సరికాదు. కరోనా వ్యాపించాక మే 2020లో నీతి ఆయోగ్ పరిస్థితిని సమీక్షించింది. వర్క్ ఫ్రం హోంను ప్రోత్సహించా. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి అవసరమైన రాయితీలు,నిర్ణయాలు చేయాలి. కార్మిక చట్టాలను సవరించడం కూడా ముఖ్యం. కరోనా అనుభవాల రీత్యా టెలి మెడిసిన్‌కు గల మార్కెట్‌ను, ఇన్సూరెన్స్ వ్యాపారానికి గల అదనపు అవకాశాలను వినియోగించు కోవాలి. ఆ మేరకు ప్రభుత్వ వైద్య వ్యవస్థను పరిమితం చేయాలి. ఇ-కామర్స్ ద్వారా ఇ ఫార్మసీని, టెలి మెడిసిన్ ని ప్రోత్సహించాలని నీతి ఆయోగ్ సిఫార్సులు చేసింది. జాతీయ డిజిటల్ హెల్త్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సందర్భంగా దేశ ఆరోగ్య వ్యవస్థలో ఒక కొత్త విప్లవం అని, టెక్నాలజీ తోడ్పాటుతో వైద్యసేవలను సునాయాసంగా పొందే వీలు కలుగుతుందని ప్రధాని మోడీ ఈ ఏడాది స్వాతంత్ర్య దిన సందేశంలో ప్రకటించారు. వైద్యులను, ఆస్పత్రులను, వైద్య సేవలందించే సిబ్బందిని, ఫార్మసీ దుకాణాలను, ఇన్సూరెన్స్ కంపెనీలను, రోగులను డిజిటల్ వ్యవస్థ ద్వారా సమీకృత వ్యవస్థలోకి తీసుకు రావడం ఈ మిషన్ లక్ష్యమని ప్రకటించారు. నీతి ఆయోగ్ సూచనల మేరకు ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ఉమ్మడిగా ఈ మిషన్ రూపకల్పన చేశాయి. మొదట ప్రయోగాత్మకంగా దేశంలోని ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలలో దీనిని అమలు చేయ నున్నారు. ప్రతి పౌరుడికీ ఒక హెల్త్ ఐ.డి, వ్యక్తిగత హెల్త్ రికార్డు డిజిటల్ గా నిర్వహిస్తారు. వైద్యులు, ఆస్పత్రులు, ఫార్మసీ దుకాణాలు, టెలి మెడిసిన్, వంటి ఇతర భాగస్వాములకు కూడా ఇదేవిధంగా డిజిటల్ రికార్డులు నిర్వహిస్తారు. పౌరుడి హెల్త్ ఐ.డి వంటి ఒకటి రెండు మినహాయించి తక్కిన డిజిటల్ రికార్డులన్నింటి నిర్వహణలో ప్రైవేటు సంస్థలకు పాత్ర ఉంటుంది. ప్రైవేటు సంస్థలు ఈ డిజిటల్ వ్యవస్థతో సమాన ప్రాతిపదికన మిళితం అవుతాయని, తమ ఉత్పత్తులను, సేవలను మార్కెట్ అవసరాలకు తగినట్టు రూపొందించుకుంటాయని నేషనల్ హెల్త్ అథారిటీ చీఫ్ ఇందు భూషణ్ ప్రకటించారు. వైద్య రంగంలో సేవలందించే బాధ్యత నుండి తప్పుకుని ఆర్థిక తోడ్పాటును మాత్రమే అందించే బాధ్యతకు ప్రభుత్వం పరిమితం కావడం అనేది ఆయుష్మాన్ భారత్ ప్రాజెక్టు వెనుక అసలు ఉద్దేశమని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక స్థాయి నుండి ప్రాంతీయ, జాతీయ స్థాయి వరకూ నిర్వహించే వైద్య సేవలను బలోపేతం చేసేబదులు, సార్వత్రిక, ఉచిత వైద్యం అందరికీ అందుబాటు లోకి వచ్చేలా విస్తరింపజేసే బదులు, ఇన్సూరెన్స్ కంపెనీలకు కొంత మొత్తం చెల్లించి తమ బాధ్యత నుండి తప్పుకోడానికే ఆయుష్మాన్ భారత్ తోడ్పడుతుంది. ఇప్పుడు అదనంగా ఈ జాతీయ ఆరోగ్య డిజిటల్ మిషన్ వచ్చాక ప్రభుత్వం పాత్ర పరిమితం అవుతుంది. అయితే లక్ష్యాలు ఉన్నతంగా కనిపిస్తున్నా ఆచరణలో మాత్రం అంత భరోసాగా కనిపించడం లేదు. పౌరుల వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని గోప్యంగా ఉంచేబదులు బహుళ జాతి కంపెనీలు కొత్త కొత్త మందులను ప్రయోగించడానికి వీలుగా వారికి సమాచారాన్ని అందుబాటులో ఉంచడం అనేది ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. అందరికీ ఆరోగ్యం అన్న విధానం మన ప్రణాళికా విధానంలో భాగంగా మొదటి నుంచీ ఉంది. 1978లో ప్రపంచ ఆరోగ్య సంస్థ 2000 నాటికల్లా అందరికీ ఆరోగ్యాన్ని కల్పించడం లక్ష్యంగా ప్రకటించింది. 1983లో మన ప్రభుత్వం తొలి జాతీయ ఆరోగ్య విధానం రూపొందించింది. తర్వాత 2002 లో మరొక విధానాన్ని ప్రకటించింది. తర్వాత నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ 2005 లో చేపట్టారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ 2013లో చేపట్టారు. మోడీ ప్రభుత్వం వచ్చాక పాత విధానాల స్థానంలో 2017లో కొత్త విధానాన్ని ప్రకటించారు. ఆరోగ్య వ్యవస్థను పెంపొందిస్తాయని ఆ విధానంలో ప్రకటించారు. 2000 నుంచి 2017 సంవత్సరాల మధ్య మన దేశంలోని కార్పొరేట్ ఆస్పత్రులు, దయాగ్నోస్టిక్ సెంటర్లు రు. 36,200 కోట్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించాయి. ఒక జాతీయ సర్వే ప్రకారం పట్టణాల్లో 70 శాతం ప్రజలు, గ్రామాల్లో 63 శాతం ప్రజలు ప్రైవేటు ఆప్పత్రులపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. ఇప్పుడు ప్రజారోగ్య వ్యవస్థ ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తూ వుంటే దాని మీద ఆధారపడి నడుస్తోంది. ఈ విధానం ఇన్సూరెన్స్

కంపెనీలకు లాభాలను తెచ్చిపెట్టేదిగా ఉంది. ఇప్పుడు తాజాగా ప్రకటించిన డిజిటల్ హెల్త్ మిషన్ ఇంకో అడుగు ముందుకేసి ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన వర్తించని ప్రజానీకాన్ని కూడా కలుపుకుంటూ, ఇటు మొత్తం ప్రజలు, అటు డాక్టర్లు, ఫార్మసిస్టులు, వైద్య పరీక్షల సెంటర్లు, ఇన్సూరెన్స్ కంపెనీలు అన్నింటినీ వైద్య వ్యాపార చట్రంలోకి తీసుకురానుంది. ఇది ఎంతవరకు ఆమోదయోగ్యమన్నది కేంద్రం ఆలోచించాలి.

## జారిపడ్డ నన్నపనేని..స్వల్పంగా గాయాలు

గుంటూరు,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): టీడీపీ సీనియర్ మహిళా నేత నన్నపనేని రాజకుమారికి గాయాలయ్యాయి. తెనాలిలోని ఆమె నివాసంలో కాలు జారి కింద పడ్డారు. దీంతో నన్నపనేని తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చెకప్ అనంతరం ఇంటికి చేరుకుని డాక్టర్ల పర్యవేక్షణలో నన్నపనేని చికిత్స పొందుతున్నారు. మరోవైపు టీడీపీ నేతలు.. నన్నపనేని ఆరోగ్యంపై కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారు.

## ఐలమ్మ స్ఫూర్తి మలిదశ ఉద్యమానికి నాంది

### -నివాళి అర్పించిన మంత్రి ఎర్రబెల్లి

జనగామ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సిద్ధించిందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతిసందర్భాన్ని పురస్కరించుఉని పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నిజాం పాలన, విస్నూరు దేశ్‌ముఖ్‌కి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. వారు చేసిన ఆనాటి ఉద్యమమే మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అయ్యిందన్నారు. చాకలి ఐలమ్మ ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం పోరాడింది. అదే భూమి రైతుకు చెందడం కోసం సీఎం కేసిఆర్ నేడు నూతన రెవెన్యూ చట్టం తీసుకొచ్చారన్నారు. రైతు సంక్షేమం కోసం ఇంకా ఏం చేయాలా అని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అందించి వారికి లాభం చేకూర్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్రం ప్రభుత్వం వ్యవసాయంపై వారి ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ వారసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హేమంత్ హంతకులను ఎన్‌కౌంటర్ చేయాలి

### -మరోమారు ఆవేదన చెందిన అవంతిరెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): హేమంత్‌ను కిరాతకంగా హతమార్చిన వారందరినీ ఎన్‌కౌంటర్ చేయాలని అతని భార్య అవంతిరెడ్డి మరోమారు డిమాండ్ చేశారు. తమను నమ్మించి మోసం చేశారని వాపోయారు. తమను బలవంతంగా ఈడ్చుకెళ్లారని, హేమంత్‌ను కిరాతకంగా చంపి తనను విధవను చేశారని ..ఇదేనా ప్రేమంటే అని మండిపడ్డారు. నాపై ప్రేమ ఉంటే నేను ప్రేమించిన వ్యక్తిని చంపుతారా? మా అమ్మానాన్నల కంటే అత్తామామ ఎక్కువగా ప్రేమిస్తారు. మా ఇంటికి 10 మంది వచ్చి బలవంతంగా తీసుకెళ్లారు. అమ్మానాన్న వద్దకు తీసుకెళ్తామని కిడ్నాప్ చేశారు. హత్యలో మేనమామలు ఇన్‌వాల్వ్ అవుతారని అనుకోలేదు. మేనమామలు విజేందర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, కలిసి చేశారు. నా భర్తను హత్య చేసిన వారందరినీ ఎన్‌కౌంటర్ చేయాలి'అని అవంతి ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. కాగా, కూతురు ప్రేమ పెళ్లి నచ్చని అవంతి తల్లిదండ్రులు లక్ష్మారెడ్డి, అర్చన హేమంత్‌ని హత్య చేయించారు. ఈకేసులో ప్రధాన నిందితుడు అవంతి మేనమామ గూడూరు యుగేందర్‌రెడ్డి. ఇప్పటివరకు 14 మందిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి ప్రాంతంలో గురువారం రాత్రి హేమంత్ హత్య చోటుచేసుకుంది.

## రెవన్యూ చట్టానికి మద్దతుగా ట్రాక్టర్ ర్యాలీ

నిర్మల్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): నూతన రెవెన్యూ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా ఆ చట్టానికి సంఘీభావంగా శనివారం నిర్మల్ నియోజక వర్గంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కనకాపూర్ వద్ద ఈ ర్యాలీని అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కేసీఆర్ ప్లెక్సీకి నాయకులు పాలు, పూలతో అభిషేకం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలిపేందుకు కృతజ్ఞతగా అన్ని మండలాల నుంచి రైతులు, పార్టీశ్రేణులు పెద్దయెత్తున తరలి వచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ నూతన రెవెన్యూ చట్టం ద్వారా పూర్తి పారదర్శకత వస్తుందన్నారు. తెలంగాణలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ శాఖలోని అవినీతిని అంతం చేసేందుకు ఈ కొత్త చట్టాన్ని తీసుకు వచ్చినట్టు తెలిపారు

# తడి, పొడి చెత్త సేకరణ వాహనాలు ప్రారంభం




ఖమ్మం, సెప్టెంబర్ 26: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన 30 వాహనాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ శనివారం ప్రారంభించారు. ఇప్పటికే నగరంలో 20 వాహనాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రతి డివిజన్‌కు ఒక వాహనాన్ని కేటాయించి.. చెత్తను సేకరిస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేసి వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఒక్కో వాహనం రూ.5.24 లక్షలు కాగా మొత్తం రూ.1.57 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు.

### మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభం

పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సూచనల మేరకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 30వ డివిజన్ స్టేషన్ రోడ్, 31వ డివిజన్ ఆర్డీఓ కార్యాలయం పక్కన, 47వ డివిజన్ నయాబజార్ సెంటర్లో నూతనంగా నిర్మించిన మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్స్ ను మంత్రి పువ్వాడ అజయ్ శనివారం ప్రారంభించారు.

కార్పొరేషన్ పరిధిలో అన్ని డివిజన్లలో ప్రజలకు సరిపడ టాయిలెట్స్ నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

ఇప్పటికే అనేక డివిజన్లలో మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్స్ ను ప్రారంభించడమైనదని, నిర్మాణంలో ఉన్న వాటిని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.

# ఎపిలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

### జగన్‌పై వ్యతిరేకతను క్యాష్ చేసుకునే వ్యూహం
### పోటీపడుతున్న టిడిపి,బిజెపి నేతలు

విజయవాడ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఎపిలో ఇప్పుడు జగన్‌పై ఉన్న వ్యతిరేకతను, పరిస్థితులను తమకు అనుకూలంగా చేసుకునేందుకు రాజకీయంగా బిజెపి,టిడిపిలు పోటీ పడుతున్నాయి. ఎవరికి వారు దేవాలయాలపై దాడుల అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారు. హిందువులపై దాడులు అంటూ వైకాపాపై రాజకీయదాడి చేస్తున్నారు. దేవాలయాలపై దాడుల వెనుక మత మార్పిడుల ఎజెండా ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. ఈ దాడుల వెనుక ఒక చీకటి ఎజెండా ఉందని.. మత మార్పిడులను పెంచి ఓటు బ్యాంకును పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. సింహాచలం నుంచి మొదలైన దాడులు తిరుమల వరకూ విస్తరించాయని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. 'దేవాలయాల్లో సంప్రదాయాలను హేళన చేయడం, అపచారాలకు పాల్పడడం, భక్తుల మనోభావాలను గాయపరచడం వంటివి యథేచ్ఛగా చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ దశలో తిరుమల ఘటనను రాజకయాం చేయాలని చూశారు. ఏపీలో రెండు పార్టీలు, రెండు కులాలుగా సాగిపోతున్న రాజకీయాన్ని మరో మలుపు తిప్పేందుకు కమలం పార్టీ ప్రయత్నిస్తోందన్న భావన ఇప్పుడు కలుగుతోంది. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సోము వీర్రాజు హిందుత్వ ఎజెండాను గట్టిగా చాటుతున్నారు. అలాగే పవన్ కళ్యాతంంతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించి ఉన్నారు. అందుకే కాపు సామాజిక వర్గాన్ని ఆకర్షించేందుకు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. తన సామాజిక వర్గం నుంచే ఈ ప్రయత్నం ప్రారంభించి త్వరలో దీనికి ఓ రూపు తీసుకురావాలనే ప్రయత్నంలో ఉన్నట్లు తజాఆ గరనలు బట్టి అర్థం చేసుకోవచ్చు. కాపు రాజకీయాన్ని బీజేపీ ఇకమీదట జనసేనతో కలిసి బలంగా చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కాపు సామాజిక వర్గానికి చెందిన సోము వీర్రాజుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టాక ఆయన కాపు ఓట్ల సమీకరణపై దృష్టి సారించారు. ముఖ్యంగా రాష్ట్రంలో తమ బలం, బలగం ఏంటన్న దానిపై స్పష్టత కలిగిన సోము వీర్రాజు బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు దూకుడు ప్రదర్శిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సోము వీర్రాజు ఇప్పటికే చిరంజీవితో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. ముద్రగడ వంటి కాపు నేతలను తనకు సహకరించాలని కోరడం ద్వారా కొత్త సమీకరణాలకు తెరలేపారు. ఉభయగోదావరి జిల్లాల్లో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు సోమువీర్రాజు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక్కడి కాపు నాయకులను ఆకర్షించే పనిలో ఆయన బిజీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలను, క్రియాశీల కార్యకర్తలను బీజేపీలోకి ఆహ్వానించే పనిలో రాష్ట్ర నాయకత్వం నిమగ్నమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని భరోసా ఇస్తున్నారు. అలాగే టీడీపీలో అధికంగా ఉన్న కోనసీమ కాపు నేతలను బీజేపీలో చేరాలని సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాల్లో టీడీపీ దిగువ క్యాడర్ లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కమలం పార్టీ..పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాలు రచిస్తోంది. అంతర్వేదిలో రథం తగులబడిన ఘటనపై రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలుస్తోంది. జనసేనతో కలిసి పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ క్యాడర్‌కు సోము వీర్రాజు పిలుపునిస్తున్నారు.. జగన్ ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలపై ప్రజాక్షేత్రంలో ముమ్మర పోరాటాలు చేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందుకే బిజెపి కార్యక్రమాలు గతంతో పోలిస్తే తీవ్రం అయ్యాయి. దూకుడు పెరిగింది. రాజకీయంగా బలం పొందేలా వ్యూహంతో సాగుతున్నారు.

## సింగరేణికి ఇద్దరు కొత్త డైరెక్టర్లు

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): సింగరేణి సంస్థకు ఇద్దరు కొత్త డైరెక్టర్లు నియామకమయ్యారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ప్లానింగ్) గా బి.వీరారెడ్డి, డైరెక్టర్ (ఇఎం) గా డి.సత్యనారాయణ రావు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కమిటీలో ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో పాటు, సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్, కోలిండియా నుంచి సీఎంపీడీఐ. చైర్మన్,ఎండీ. శేఖర్ సరన్, కేంద్రబొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ పీఎస్ఎల్ స్వామి ఉన్నారు. డైరెక్టర్ (పి/పి) గా ఎంపికైన బి.వీరారెడ్డి ఇంతకు ముందు అడ్రియా లాంగ్ వాల్ ఏరియా జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. డైరెక్టర్ (ఇ/ఎం)గా ఎంపికైన డి.సత్యనారాయణ రావు ప్రస్తుతం భూగర్భ గనుల జనరల్ మేనేజర్ (ఇ/ఎం) గా పనిచేస్తున్నారు.

## కార్పొరేట్ వర్గాలకే మోదీ ప్రధాని: మండిపడ్డ విహెచ్

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): మోదీ కార్పొరేట్ వర్గాలకే ప్రధాని అని.. కొత్త వ్యవసాయ చట్టంతో రైతుల పొట్ట కొడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీహెచ్ ధ్వజమెత్తారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ రైతుల కోసం ఎంతో చేసిందన్నారు. రైతుల కోసం తెచ్చిన కాంగ్రెస్ పథకాలను బీజేపీ హైజాక్ చేస్తోందని వీహెచ్ పేర్కొన్నారు. కొత్త చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలకు పిలుపునచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు రెవెన్యూ డివిజన్ ఆర్డీవో ఆఫీస్ ముట్టడికి బయలుదేరుతున్న నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసారు. రంగారెడ్డి డీసీసీ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి.. మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షులు సామిడి గోపాల్ రెడ్డిని, కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

## సరిహద్దులు మీరితే ప్రతిఘటన తప్పదు

### సైన్యాన్ని అదుపులో ఉంచుకోండి
### చైనాకు భారత్ ఘాటు హెచ్చరిక

న్యూఢిల్లీ,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని భారత్, చైనాకు స్పష్టం చేసింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) కవ్వింపులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వాస్తవాధీన రేఖను దాటి భారత స్థావరాల వైపు చొచ్చుకువచ్చే ప్రయత్నం చేస్తే గట్టిగా సమాధానం ఇస్తామని పేర్కొంది. ఒప్పందాలు అతిక్రమించి ముందుకు వచ్చినట్లయితే ఆత్మరక్షణకై కాల్పులకు దిగేందుకు తమ సైనికులు వెనుకాడబోరని హెచ్చరికలు జారీ చేసిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. గల్వాన్ లోయలో ఘర్షణలు చోటుచేసుకున్న నాటి నుంచి భారత్- చైనా సరిహద్దుల్లో ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు దఫాల చర్చల అనంతరం బలగాల ఉపసంహరణకు అంగీకారం కుదిరింది. అయితే డ్రాగన్ ఆర్మీ మాత్రం కొన్ని ప్రదేశాల్లో దుందుడుగానే వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో దేశాంగ శాఖ అధికార ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ గురువారం మాట్లాడుతూ.. తూర్పు లద్ధాఖ్‌లోని సరిహద్దుల్లో ఉన్న అన్ని ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ ప్రక్రియ కొంత సంక్లిష్టమైందని పేర్కొన్నారు. ఇందుకు పరస్పర ఆమోదనీయ నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, యథాతథ స్థితిని ఏకపక్షంగా మార్చే ప్రయత్నాలను విరమించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో చైనా ఆర్మీ అదే మొండివైఖరి ప్రదర్శిస్తే భారత్ కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా విశ్వసనీయ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియా పేర్కొంది. అన్ని ఏరియాల నుంచి బలగాలను ఉపసంహరించుకోవాల్సిందిగా డ్రాగన్ ఆర్మీకి స్పష్టం చేసినట్లు వెల్లడించింది.

## రాజీవ్ రహదారి వెంట పెద్ద ఎత్తున మొక్కల పెంపకం: కలెక్టర్

సిద్దిపేట,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా శామీర్‌పేట నుంచి కరీంనగర్ జిల్లా సరిహద్దు వరకు రాజీవ్ రహదారి వెంట మరో దశ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి. వెంకట్రామిరెడ్డి ఆదేశాలు జారీచేశారు. శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం సందర్భంగా కలెక్టర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ కింద నిధులను మొక్కలకు సపోర్ట్‌గా పాతే కర్రలను కొనుగోలు చేయాల్సిందిగా సూచించారు. తక్షణమే రహదారి వెంట మొక్కలు నాటేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాల్సిందిగా జిల్లా అటవీ అధికారి సీహెచ్ శ్రీధర్‌ను ఆదేశించారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ దీపక్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌బాబు, డీఎఫ్‌వో శ్రీధర్, సిద్దిపేట ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు

### రాయచూరు ప్రధాన రహదారిపై భారీగా వర్షం నీరు
### జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద





మహబూబ్‌నగర్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చోట్ల రహదారుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. రాకపోకలు ఆగిపోయాయి. మహబూబ్‌నగర్- నవాబ్‌పేట, వనపర్తి జిల్లా కొత్తకోట- ఆత్మకూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్ రాయచూరు ప్రధాన రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచిపోవడం కొద్ది సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో 13 గేట్లు ఎత్తి దిగువనకు 1.26లక్షల క్యూసెక్కుల నీటిని దిగువనకు వదులుతున్నారు. చి÷-టటెం నర్సిరెడ్డి సంగంబండ రిజర్వాయర్ నిండటంతో 10 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. మరోసారి కోయిల్ సాగర్ ప్రాజెక్టు నిండిపోవడంతో 5 గేట్లు ఎత్తి దిగువనకు నీటిని విడుదల చేస్తున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం సరళాసాగర్ ప్రాజెక్టు 2ఉడ్ సైఫన్లు, 2ప్రైమరీ సైఫన్లు తెరుచుకోవడంతో భారీగా వరద నీరు దిగువనకు వెళ్తోంది. మదనాపురం మారెడ్డిపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మదనాపురం-ఆత్మకూరు పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధన్వాడ మండల కేంద్రంలో ఓ మట్టి మి÷-దదె కూలింది. వనపర్తి, కోస్గి, గద్వాల పట్టణాల్లో వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మహబూబ్ నగర్ జిల్లా కోయిల్ కొండ, నవాబ్ పేట, గండీడ్, హన్వాడ మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా పారుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. దేవరకద్ర మండలం కౌకుంట్ల పెద్ద చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతుండడంతో వాగు రోడ్డు పైకి ఎక్కి పాడుతుండగా కౌకుంట్ల,ఇస్సరం పల్లి గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి కర్ణాటకలోని రాయచూరు పట్టణానికి మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. నందిన్నె వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు కొట్టుకుపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. దేవరకద్ర మండలంలో 136 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. దామరగిద్ద 120, మరికల్ 111, వెల్దండ 81, కోయిలకొండ 74 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది.

లోతట్టు ప్రాంతాల్లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పర్యటన

హబూబ్‌నగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు వర్షపు నీటిలో నిలిచిపోయాయి. వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలైన రామయ్య బౌలి, బీకే రెడ్డి కాలనీల్లో కొన్ని ప్రాంతాలు జలమయం అయ్యాయి. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని గమనించారు. స్థానికులకు సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నూతన రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్, వనపర్తి జిల్లాల్లో రైతులు తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీలను వాయిదా వేసుకున్నారు. శుక్రవారం రాత్రి నుంచి ఆగకుండా వర్షాలు కురుస్తున్న తరుణంలో ట్రాక్టర్ ర్యాలీలను వాయిదా వేసినట్లు రైతులు తెలిపారు. మరోవైపు ఆదివారం నాడు తలపెట్టిన మహబూబ్ నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల ట్రాక్టర్ ర్యాలీలను సైతం వర్షం ప్రభావం వల్ల వాయిదా వేసుకున్నట్లు రైతులు వెల్లడించారు. మ్మడి జిల్లాలో ఆగకుండా కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు అప్రమత్తం అయ్యారు. వాగులు పొంగిపొర్లుతున్న పలు ప్రాంతాల్లో సిబ్బందిని వంపించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలను చేపడుతున్నారు. ప్రమాదకరంగా పొంగిపొర్లుతున్న వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచిస్తున్నారు.

# 4న జరిగే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు విస్తృతమైన ఏర్పాట్లు

### విశాఖపట్నం,విజయవాడ,తిరుపతి,అనంతపురంల్లోని 68 కేంద్రాల్లో పరీక్షలు
### ఉ.9.30గం.నుండి 11.30.గం.లు, 2.30గం.నుండి4.30గం.ల వరకు
### 30వేల 199 మంది అభ్యర్థులు ఈప్రిలిమినరీ పరీక్షలకు హాజరు
### కరోనా నేపథ్యంలో అభ్యర్థులంతా మాస్క్ ధరించాలి
### గంట ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
### ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

అమరావతి,సెప్టెంబరు26(ఆర్ఎన్ఎ): అక్టోబరు 4వతేదీ ఆదివారం రాష్ట్రంలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ వ్రాత పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(పొలిటికల్)ప్రవీణ్ ప్రకాశ్ తెలియజేశారు. విశాఖపట్నం,విజయవాడ, తిరుపతి, అనంతపురం నగరాల్లోని 68 పరీక్షా కేంద్రాల్లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సంబంధించి ఈపరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. సంబంధిత జిల్లాల కలక్టర్లు కోఆర్డినేటింగ్ సూపర్వైజరీ అధికారులుగాను విశాఖపట్నం,విజయవాడ కేంద్రాల్లో ఇద్దరేసి సీనియర్ ఐఏఎస్ అధికారులు,తిరుపతి,అనంతపురం కేంద్రాలల్లో ఒక్కొక్క సీనియర్ ఐఏఎస్ అధికారిని పరిశీలకునిగా నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈవ్రాత పరీక్షలకు మొత్తం 30వేల 199 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అక్టోబరు 4వతేదీ ఆదివారం ఉదయం 9.30గం.ల నుండి 11.30గం.ల వరకూ మరలా మధ్యాహ్నం 2.30గం.ల నుండి 4.30గం.ల వరకూ రెండు సెషన్లలో జరిగే ఈసివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ వ్రాత పరీక్షలకు హాజరు కాబోయే అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలియజేశారు. అంతేగాక పరీక్ష ప్రారంభానికి 10నిమిషాల ముందు ఆయా పరీక్షా కేంద్రాల గేటులను మూసి వేయడం జరుగుతుందని ఆతర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లోనికి బ్యాగులు, మొబైల్ ఫోన్లు,ఐటి సంబంధిత వస్తువులు,ఇతర ఎలక్ట్రానిక్,కమ్యునికేషన్ సంబంధిత వస్తువులు వేటిని లోనికి అనుమతించరని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థీ విధిగా మాస్క్ లేదా ఫేస్ కవర్ ధరించి మాత్రమే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ స్పష్టం చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల ప్రాంగణాలు,ప్రవేశ ద్వారాలు,పరీక్షా హాలుల్లోని టేబుళ్ళ,కుర్చీలు,వాష్ రూమ్లు,మరుగు దొడ్లను పూర్తిగా శానిటైజ్ చేయించాల్సిందిగా జిల్లా కలక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రతి పరీక్షా హాల్ వద్ద శానిటైజర్,ఫేస్ మాస్క్,గ్లవుజులు వంటివి అందుబాటులో ఉంచేలా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. అదే విధంగా పరీక్షా హాల్లో అభ్యర్థికి అభ్యర్థికి మధ్య 2 చదరపు మీటర్ల భౌతిక దూరం ఉండే విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. అంతేగాక ఆయా పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా జిల్లా కలక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు ముఖ్య కార్యదర్శి ప్రవీణ ప్రకాశ్ తెలియజేశారు.

# జిల్లాలో 55 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు

### -కేంద్రం అనుమతులపై అధికారులతో మంత్రి హరీష్ సమీక్ష

సిద్దిపేట,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): జిల్లాలో 55వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, ఈ మేరకు జలాశయాల ఆయకట్టు పరిధిలో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట నుంచి ఆయిల్ పామ్ సాగుపై ఉద్యానవన కమిషనర్ వెంకట్రామరెడ్డి, కలెక్టర్ వెంకట్రామరెడ్డి, జిల్లా ఉద్యానవన ఉప సంచాలకులు రామలక్ష్మి, మండలాల ప్రజాప్రతినిధులు, రైతుబంధు సమితి సభ్యులు, పెదవేగి జాతీయ అయిల్ ఫాం పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, ఖమ్మం, నల్గొండ ఆయిల్ ఫాం సాగు చేస్తున్న 1600 మంది రైతులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు రెండుగంటల పాటు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సంప్రదాయ పంటల సాగుతో పోల్చితే ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలున్నాయని మంత్రి తెలిపారు.

నాలుగేళ్ల నుంచి మొదలై.. 30 ఏళ్ల పాటు ఆయిల్ ఫాం దిగుబడి వస్తుందని చెప్పారు. అంతర పంటల సాగుకు సైతం అనుకూలమని చెప్పారు. ఎకరా వరికి అవసరమయ్యే నీటితో నాలుగెకరాల్లో ఈ పంటను సాగు చేయవచ్చని చెప్పారు. ఆయిల్ ఫాం సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందజేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో సాగు నీటి సౌకర్యం గణనీయంగా మెరుగైన నేపథ్యంలో సిద్దిపేట రైతులు విస్తృతంగా ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఉద్యానవన అధికారులు, రైతు బంధు సమితి సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. మంత్రి సూచనతో ఖమ్మం, నల్గొండ జిల్లాలో ఇది వరకే పంటను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతులు తమ విజయగాథను టెలీకాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఆయిల్ ఫాం సాగు విధానం, కలిగే ప్రయోజనాలను, మార్కెటింగ్ సౌకర్యం తదితర అంశాలపై జాతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

రైతు ఆదాయం పెరిగేలా చేయాలి

రైతుకు ఆదాయం పెరిగేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో సిద్ధిపేట రూరల్, నారాయణరావుపేట మండలాలకు చెందిన 422 మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు, 28 మందికి కల్యాణలక్ష్మి, ఒకరికి షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు.

అంతకు ముందు చిన్నకోడూర్ మండలం పెద్దకోడూర్కు చెందిన 590 మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు, భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన 267 మందికి రూ.3200 చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది వానలు అధికంగా కురిశాయని, కాళేశ్వరం నీళ్లు రావడంతో కాలమైందన్నారు. ఈ యేడాది డబుల్ ధమాకా అనీ, బోర్లు, బావులు నిండి పారుతున్నాయన్నారు. ఇలా జరగాలని ఎన్నో ఏండ్ల నుంచి కలలుగన్నామని, ఈ యాసంగికి బలువైన పంట పండుతుందన్నారు. వారం రోజుల్లోపు నియోజకవర్గంలో ఏదైనా గ్రామం ముందుకొస్తే సీడ్ విలేజ్‌గా మార్చేందుకు కృషి చేస్తానని హరీశ్‌రావు పేర్కొన్నారు. విత్తనోత్పత్తి కేంద్రంగా జిల్లాను మార్చుకుందామని పిలుపునిచ్చారు. విత్తనోత్పత్తిలో భాగంగా వరి, మక్క పెడితే రైతులకు అధిక లాభాలుంటాయన్నారు. విత్తనం తయారు చేస్తే రూ.50వేల నుంచి రూ.60వేల వరకు మిగులుతుందని చెప్పారు. కాళేశ్వరం జలాలతో జిల్లా అన్ని వనరులు సమృద్ధిగా పొందిందని, రైతుల ఆదాయం పెరగాలని, విత్తనోత్పత్తి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. నిన్నటి వరకు విత్తనాలు కొన్నాం.. రేపటి నుంచి విత్తనోత్పత్తి తయారు చేద్దామన్నారు. పామాయిల్ తోటలు జిల్లాలో 50వేల ఎకరాలల్లో సాగు చేయవచ్చని తేలిందని, పామాయిల్ సాగుతో అన్నీ ఖర్చులు పోనూ కనీసం రూ.లక్ష వరకు మిగులుతాయని మంత్రి వెల్లడించారు. కీరదోస, కూరగాయల సాగు, మల్బరీ వైపు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులకు మంత్రి సూచించారు. సంప్రదాయ పంటల నుంచి ఆధునిక పంటలతో విత్తనోత్పత్తి చేద్దామని ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. విత్తనోత్పత్తి కోసం పోటీ పడాలని కోరారు.

## అక్టోబర్ 9న నిజామాబాద్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక

### -షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలయ్యింది. అక్టోబర్ 9న ఉపఎన్నిక జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇక 12వ తేదీన కౌంటింగ్ చేపట్టి, ఫలితం విడుదల చేస్తారు. గతంలోనే ఉపఎన్నికకు నోటిఫికేషన్ వచ్చినా కరోనా కారణంగా పోలింగ్ వాయిదా పడింది. భూపతిరెడ్డిపై అనర్హత వేటుతో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఖాళీ ఏర్పడింది. ఇక ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను ముందే ఖరారు చేశారు పార్టీలు. టీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ నుంచి సుభాష్‌రెడ్డి బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి యెండల లక్ష్మీనారాయణ పోటీ చేస్తున్నారు. మొత్తానికి కరోనా కారణంగా వాయిదా పడ్డ నిజామాబాద్ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఓటు హక్కును కలిగి ఉన్నారు. వీరే స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీని ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు స్పష్టమైన ఆధిక్యం ఉన్నందున కవిత గెలుపు సునాయాసం కానుంది.

## కరోనాతో ఇప్పటి వరకు 9,88,576 మంది బలి

### -కరోనా కట్టడికి రష్యా కఠిన చర్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): గత 9 నెలలుగా యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి ఇప్పటివరకు 9,88,576 మంది ప్రాణాలను బలితీసుకుంది. సుమారు 75 లక్షల మంది వైరస్ కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. వారిలో 63,402 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న తమవారు ప్రాణాలతో తిరిగిరావాలని కుటుంబ సభ్యులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇక కంటికి కనిపించని కరోనా వైరస్ దెబ్బతో ఇదీ అదీ అని కాకుండా అన్ని దేశాలు తీవ్ర ఆర్థిక, ప్రాణ నష్టాలను మూటగట్టుకున్నాయి. మరోవైపు కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా రష్యా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ రోజురోజుకూ దేశంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. కరోనా నివారణ చర్యల్లో భాగంగా రష్యా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

రష్యా రాజధాని మాస్కోలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు వేగంగా పెరుగుతుండడంతో వృద్ధులు ఇంట్లో ఉండాలని, యజమానులు వీలైనంత ఎక్కువ మంది రిమోట్‌గా పనిచేయడానికి అనుమతించాలని మాస్కో అధికారులు సిఫారసు చేశారు. రష్యాలో శుక్రవారం రోజు కొత్తగా 7,212 కొత్త కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు వెల్లడించారు. ఇది జూన్ నుంచి రోజువారీ అత్యధిక పెరుగుదల అని అధికారులు పేర్కొన్నారు. మాస్కోలో గత వారంలో కొత్త రోజువారీ అంటువ్యాధుల సంఖ్య పెరగడం ప్రారంభమైందని, రెండు వారాల క్రితం 700 లోపు ఉన్నా శుక్రవారం నుంచి 1,500కు పైగా ఉందని తెలిపారు.

## డ్రగ్స్ కేసులో రకుల్ వాంగ్మూలం నమోదు

ముంబై,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య ఘటనతో సంబంధం కలిగిన డ్రగ్స్ కేసులో దర్యాప్తు వేగంగా కొనసాగుతున్నది. తాజాగా హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) విచారించింది. ఈ కేసు దర్యాప్తు కోసం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ) శుక్రవారం రకుల్ ప్రీత్‌సింగ్ వాంగ్మూలాన్ని నమోదు చేసిందని ఎన్‌సీబీ డైరెక్టర్ అశోక్ జైన్ తెలిపారు. రకుల్ ప్రీత్‌సింగ్ నుంచి తీసుకున్న స్టేట్‌మెంట్ ముందుగా విశ్లేషించబడుతుందని, ఆ తర్వాత దాన్ని కోర్టుకు సమర్పిస్తారని ఆయన తెలిపారు.

## ప్రజలకు అందుబాటులో దుర్గంచెరవు

### -ప్రాంభించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): భాగ్యనగర వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ వంతెనను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, మంత్రులు తలసాని, శ్రీనివాస్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45ను కలుపుత్తూ÷÷-ల ఓవర్‌ను నిర్మించారు. ÷÷-ల ఓవర్‌కు పెద్దమ్మతల్లి ఎక్స్‌ప్రెస్ వేగా ప్రభుత్వం నామకరణం చేసింది. ఆసియాలోనే రెండవ అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణంగా ఈ వంతెన రూపుదిద్దుకుంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వైపు నుంచి సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం దుర్గం చెరువు, రోడ్ నెంబర్ -45లో వంతెన నిర్మించారు. రూ.184 కోట్లతో దుర్గం చెరువుపై, రూ.150 కోట్లతో రోడ్ నెంబర్-45లో వంతెనల పనులు పూర్తిచేశారు. రోడ్ నెంబర్-45 నుంచి ఐటీ కారిడార్‌కు సులువైన ప్రయాణానికి అవకాశం కలగనుంది.

## అదఖ్‌లో స్వల్ప భూప్రకంపనలు

శ్రీనగర్,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): జమ్మూకాశ్మీర్ సమీపంలోని భూప్రకంపనలు సంభవించాయి. లడఖ్ ప్రాంతంలో శుక్రవారం 10 కిలోమీటర్ల లోతులో 5.4 తీవ్రతతో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. భూకంపం యొక్క కేంద్రం లేకు ఈశాన్యంగా 129 కి.మీ. ఇంతలో భూకంపం కారణంగా కేంద్ర భూభాగంలో ఎటువంటి ప్రాణ నష్టం, గాయాలు సంభవించలేదని పేర్కొంది.

## భూవివాదంలో పరస్పరం కత్తులతో దాడి

### -తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు మృతి

వనపర్తి,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): భూవివాదంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగి చివరకు కత్తులతో దాడి చేసుకోవడం.. ఇద్దరూ మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లాలో కలకలం రేపుతోంది... పూర్తి వివరాల్లోకి వెళ్తే.. పెబ్బేర్ మండలం శాఖపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య భూమి విషయంలో వివాదం రేగింది.. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి.. చివరకు ఇద్దరూ పరస్పరం కత్తులతో దాడికి దిగారు.

ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా... తీవ్ర గాయాలపాలైన మరో వ్యక్తిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.. క్షణికావేశంలో కత్తులతో దాడి చేసుకోవడంతో.. ఇద్దరు ప్రాణాలు కోల్పోయి.. రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపారు.

## ఎస్పీ బాలు మృతి తెలుగు భాషకు లోటు

### సుప్రీంకోర్టు న్యాయమూర్తి రమణ సంతాపం

న్యూఢిల్లీ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ):తన అమృతగానంతో తెలుగు భాష, సాహిత్య చరిత్రలను సజీవంగా ఉంచడమే కాకుండా ప్రజ్వరిల్లింపజేసిన మహనీయుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. ఆయన మరణం తెలుగు భాషకు, జాతికి తీరని లోటని చెప్పారు.

సుస్వర మాధుర్యంతో యావత్ ప్రపంచాన్ని ఆనందసాగరంలో ఓలలాడించిన గొప్ప మనిషి ఎస్పీ బాలు అని ఆయన కొనియాడారు.

తన అమరగానంతో తెలుగుభాషలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది సంగీత ప్రియుల హృదయాలను కొల్లగొట్టి యావత్ సంగీత సామ్రాజ్యాన్ని అప్రతిహతంగా ఏలిన జైత్రయాత్రికుడు ఆయన. తెలుగుజాతి ఉన్నంతవరకు అందరి హృదయాల్లో బాలు ఉంటారు.

ఆయన మరణం తెలుగుతల్లికి గర్భశోకం. తెలుగువారంతా బాలు కుటుంబసభ్యులే. అందుకే ఆయన్ను కోల్పోయి కుమిలిపోతున్న వారి కుటుంబసభ్యులతోపాటు యావత్ సంగీత అభిమానులందరికీ నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నా అని జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నారు.

# కవిత గెలుస్తారు..మంత్రి అవుతారు

## టీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
## గెలుపు నల్లేరు మీద నడకే అంటున్న పార్టీ నేతలు

నిజామాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీ ఉప ఎన్నిక తేదీ ప్రకటించడంతో నిజామాబాద్ జిల్లాలో మళ్లీ రాజకీయ వేడి అందుకుంది. కవిత ఎమ్మెల్సీగా పోటీ చేస్తుండడంతో టీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ రంగంలోకి దిగుతున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కావడంతో గెలుపు కవితకు సునాయాసం కానుంది. అలాగే ఆమె మండలిలో ప్రవేశించి మంత్రి అవుతారని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. 90శాతానికి పైగా జడ్పీటీసీలు,ఎంపిటీసీలు టిఆర్ఎస్ పక్షాన ఉండడంతో గెలుపుపై పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. దీంతో సీఎం కేసీఆర్ కూతురు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత శాసనమండలి సభ్యురాలిగా ఎన్నికవడం దాదాపు ఖాయమైంది. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఆమె బరిలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికకు సంబంధించి గత ఏప్రిల్ 7వ తేదీనే పోలింగ్ జరగాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయిదా పడింది. తాజాగా అక్టోబర్ 9న పోలింగ్, 12న ఓట్ల లెక్కింపు జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. 14న ఎన్నికల పక్రియ ముగుస్తుందని పేర్కొంది. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలిపింది. ఇక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు టీఆర్ఎ?సకు చెందినవారే ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఎమ్మెల్సీగా కవిత ఎన్నిక లాంఛనమే కానుంది. ఈ స్థానం నుంచి 2016లో టీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన భూపతిరెడ్డి ఆ తర్వాత కాంగ్రె?సలో చేరడంతో పదవీకాలం ముగియకుండానే ఆయనపై అనర్హత వేటు పడింది. దీంతో ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహణకు పూనుకుంది. టీఆర్ఎస్ తరఫున కవిత, కాంగ్రెస్ నుంచి వ్డడెపల్లి సుభాష్రెడ్డి, బీజేపీ తరఫున లక్ష్మీనారాయణ బరిలో నిలిచి.. పోలింగ్కు సన్నద్ధమవుతున్న క్రమంలో కరోనా కారణంగా ఎన్నికల షెడ్యూల్ను ఈసీ వాయిదా వేసింది. ఇప్పుడు మళ్లీ పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలను ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్కున్న మెజారిటీ దృష్ట్యా గెలుపోటములపై ఉత్కంఠ లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఉన్న సత్సంబంధాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. కవితను గెలిపించుకునే బాధ్యత ఇప్పుడు స్థానిక నేతలతో పాటు జిల్లా మంత్రి వేముల ప్రశాంత రెడ్డి, స్పీకర్ పోచారంలపై పడింది. అయితే స్పీకర్ ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా సూచనలు ఇచ్చే అవకాశం ఉంది. నిజామాబాద్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఓట్లుగా ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మునిసిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు 824 ఉండగా, అందులో కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ కలిపి 180లోపే ఉన్నాయి. అయినప్పటికీ ఈ ఉప ఎన్నిక విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని టీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తోంది. అయితే కరోనా కారణంగా క్యాంపులు నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు కరోనా బారిన పడ్డారు. మరొకొందరు కరోనా సోకి, చికిత్స తదుపరి కోలుకున్నారు. ఈ మేరకు ఎక్కడికక్కడ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్రెడ్డి, ఎమ్మెల్యేలను కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం.

# ఎపి వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

## పొంగి పొర్లుతున్న వాగులు వంకలు
## ప్రకాశం బ్యారేజీ వద్ద పోటెత్తిన కృష్ణమ్మ
## పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తం
## నీటమునగడంతో పంటలకు భారీ నష్టం
## కర్నూలు జిల్లాలో భారీ వర్షాలతో పొంగుతున్న వక్కిలేరు వాగు
## కడపలో కుందూకు పోటెత్తిన వరద
## ప్రకాశంలో జలమయం..వాగులో కొట్టుకు పోయిన విద్యార్థి
## అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన హోంమంత్రి సుచరిత

విజయవాడ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): గత కొన్నిరోజులుగా ఆంధ్రప్రదేశ్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నారు. ప్రకాశం, కడప,గుంటూరు జిల్లాలో భారీ వర్షాలు కురిసాయి. కర్నూలులో పలు వాగులు పొంగుతున్నాయి. ఎగువ నుంచి వరద వస్తుంటడంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో సుమారు లక్ష క్యూసెక్కులను దిగువ కృష్ణా కెనాల్తోపాటు సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల అధికారులు తెలిపారు. ఏపీవ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లుతోంది. వాగులు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కర్నూలు జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంట నష్టంతో పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా బండి ఆత్మకూరు మండలంలో 180.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మహానంది -గాజులపల్లి మధ్య పాలేరు వాగు వంతెనపై నుండి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నంద్యాల - భీమవరం మధ్య వక్కిలేరు వాగు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గడివేముల మండలం కోరటమద్ది వద్ద వాగు పొంగిపొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వినుకొండ, సీతయ్య నగర్లో వర్షానికి ఓ పెంకుటిల్లు కూలిపోయింది. రాజుపాలెం మండలం బలిజేపల్లి వద్ద ఎద్దు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజధాని గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. తుళ్లూరు మండలం పెదపరిమి వద్ద వాగు పొంగి పొర్లుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డెల్టా ప్రాంతంలో కుండపోత వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. కడప జిల్లా పెద్దముడియం మండలంలో కుందూ ప్రవాహం పెరుగుతుంది. లోతట్టు గ్రామాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు దండోరా వేయించారు. నెమలిదిన్నె, బలపన గుదూరు, చిన్నముడియం, సిరిపాల దిన్నే, గర్శలూరు, ఉప్పలూరు, పెద్దముడియం గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉంది. పోరుమామిళ్ళ, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. పోరుమామిళ్ళ మండలంలో నాగలకుంట్ల, బూరగమానుపల్లె చెరువులు పూర్తిగా నిండుకున్నాయి. గోపవరం మండలం మడకల వారిపల్లె రాచెరువుకు భారీగా వర్షపు నీరు చేరింది. ఐదేళ్ల తర్వాత చెరువుకు నీరు చేరడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కడప జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రొంపిచర్ల మండలం మునమాక, తుంగపాడు వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నరసరావుపేట వైపు రాకపోకలు బంద్ అయ్యాయి. తుళ్లూరు మండలం పెదపరిమి వద్ద కొట్టేళ్ల వాగు పొంగడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. కడప నగరంలోని ఆర్టీసీ గ్యారేజీలో భారీగా వర్షపు నీరు వచ్చి చేరుకుంటోంది. అలాగే జిల్లాలోని కమలాపురం – ఖాజీపేట ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జిపై పాగేరు వంక పొంగి పొర్లుతోంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రమాదకర స్థాయిలో కడప జిల్లా బుగ్గ ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. నాలుగు గేట్ల ద్వారా నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. బుగ్గవంక పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. బుగ్గవంక కాలువ పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా పర్యటించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చదలవాడ చెరువుకు గండి పడటంతో చీరాల – ఒంగోలు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గిద్దలూరులో శ్రీనివాస థియేటర్ వద్ద ఇళ్ల లోకి చేరిన వరద నీరు చేరడంతో ప్రజలను పోలీసులు ఖాళీ చేయిస్తున్నారు. రాచెర్ల మండలంలో గుండ్లకమ్మ ఉగ్రరూప దాల్చింది. గిద్దలూరు–ఆకవీడుకు రాకపోకలు బంద్ అయ్యాయి. బెస్తవారిపేట మండలంలో వాగులు పొంగిపొర్లు తున్నాయి. బాసినేపల్లి వద్ద వాగు పొంగడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకాశం జిల్లా కంభం మండలంలోని రావిపాడు వద్ద గండ్లకమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాగులో ఒక ట్రాక్టర్ కొట్టుకుపోయింది. పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో ట్రాక్టర్లో ఏడుగురు ఉన్నట్టు సమాచారం.ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చదలవాడలో భారీ వర్షానికి చెరువుకట్ట తెగిపోయింది. దీంతో ఎస్టీ కాలనీలోని ఇళ్లలోకి చెరువు నీరు వచ్చి చేరుతోంది. అలాగే వాగు ఉధృతికి ఆర్టీసీ బస్సు ఒరిగింది. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రయాణికులను కాపాడారు. స్థానికులను అప్రమత్తం చేసిన పోలీసులు వాహనదారులకు అంతరాయం లేకుండా సహాయక చర్యలు చేపట్టారు. బల్లికురవ మండలం అంబడిపూడి వద్ద రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తూర్పు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ఉధృతికి ఇద్దరు విద్యార్థులు కొట్టుకుపోగా.. స్థానికులు ఒకరిని కాపాడారు. మరొకరు మృతి చెందారు. అంబడపూడి గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థి శ్రావణ్ కుమార్ మృతి చెందాడు. అనంతపురం జిల్లా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తాడిపత్రి, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లో కుండపోత వర్షం పడుతుంది. డోనేకల్ వాగు పొంగిపొర్లడంతో గుంతకల్లు–బళ్లారి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తూర్పుగోదావరిలో ఎగువన గోదావరి పరివాహక ప్రాంతంలో భారీగా కురుస్తున్న వర్షాలకు గోదావరిలోకి వరద నీరువచ్చి చేరుతుంది. దీంతో ధవళేశ్వరం బ్యారేజ్ నుండి నాలుగు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద కూడా వరద నీటిమట్టం 5 లక్షల క్యూసెక్కుల వరకు ఉండటంతో ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద కు మరింత వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో వర్షాల ప్రభావం పెద్దగా లేకపోయినా గోదావరి కాస్త పెరిగితే లంక గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అయితే ఐదు లక్షల క్యూసెక్కుల కు మించి వరదనీరు పెద్దగా వచ్చే అవకాశం లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఇదిలాఉండగా శనివారం దేశంలోని పలు ద్వీపకల్ప ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది.

మరఠ్వాడ, ఉత్తర కర్ణాటక, తెలంగాణ, రాయలసీమ, ఆంధప్రదేశ్లోని

తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని వెల్లడించింది. వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హోం, విపత్తు నిర్వహణ శాఖా మంత్రి మేకతోటి సుచరిత సూచించారు.

శనివారం మీడియాతో మాట్లాడుతూ రాగల రెండు రోజుల్లో పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలలో అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. అదే విధంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి సుచరిత సూచనలు చేశారు.

# టిఆర్కె సేవలు మరువలేనివి

## -పాఠశాల మరమ్మతులకు 20వేల నగదు సహాయం

వేములవాడ, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని శిశుమందిర్ పాఠశాల



మరమ్మతులకు టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ 20 వేల సహాయం శనివారం అందజేశారు.

ముందుగా పాఠశాలను సందర్శించిన టి ఆర్ కె శ్రీ సరస్వతి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం శిశు మందిర్ పాఠశాల ఆవరణలో తరగతి గదులను పరిశీలిం చారు. టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ ను స్థాపించి ప్రజలకు ఎన్నో సేవలందించిన తోట రామ్ కుమార్ ను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులు మాట్లాడుతూతోట రామ్ కుమార్ గతంలో కూడా పాఠశాల అభివృద్ధికి సహాయం అందించారని, ఇప్పుడు పాఠశాల మరమ్మతులకు 20వేల రూపాయలను సాయం చేయడం చాలా అభినందనీయం అన్నారు. లాక్ డౌన్ లో వేములవాడ పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకులను అందజేసిన టి ఆర్ కె రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చందనం శ్రీకాంత్, ట్రస్ట్ డైరెక్టర్లు గోలి శ్రీనివాస్, మొట్టల మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, పాఠశాల నిర్వాహకులు రైకనపేట శ్రీనివాస్, కనికరపు రాజయ్య, ప్రధానాచార్యులు చిలుక గట్టు, టి.ఆర్.కె వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో బిజెపికి ఓటేస్తే మోసపోయినట్లే

మెదక్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): కేంద్రం ఆమోదించిన అగ్రికల్చర్ బిల్లులను దేశ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, రాస్తారోకోలు, రైల్రోకోలు చేపట్టారని మంత్రి హరీష్రావు తెలిపారు. కానీ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో రాష్ట్రంలో రైతులు సంబురాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ రైతులు ఊరురా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ర్యాలీలు చేపట్టి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని మంత్రి చెప్పారు. అదే సమయంలో కేంద్ర వ్యవసాయ బిల్లులను రైతులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. మెదక్ జిల్లాలోని చేగుంటలో ఇతర పార్టీలకు చెందిన వందలాది మంది కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి హరీష్రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. దుబ్బాక ఉప ఎన్నికలో బీజేపీకి ఓటేస్తే మోసపోయినట్లేనని చెప్పారు. కేంద్రం ఆమోదించిన అగ్రికల్చర్ బిల్లులతో రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. విద్యుత్ చట్టం వల్ల రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. బావుల వద్ద మోటార్లు బిగించి బిల్లులు వసూలు చేయాలని బీజేపీ భావిస్తోంది. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుందని గుర్తు చేశారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడమే కాకుండా రైతుబంధు, రైతుబీమా పథకాలతో అన్నదాతల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. చేగుంటలో షాదీఖాన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూమి పంచాయతీలను శాశ్వతంగా పరిష్కరించేందుకు డిజిటల్ సర్వే చేపడుతామని మంత్రి హరీష్రావు తెలిపారు.

## ఆటో బోల్తా ఒకరు మృతి

విజయవాడ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన ఘటన మద్దిపాడు మండలంలోని దొడ్డవరంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే శివరాంపురానికి చెందిన దేవదాసు, ఎరజాని మరియమ్మ, పేరమ్మలతో పాటు మరో ఏడుగురు దేనువుకొండ పొలాల్లోకి మిరపనారు వేసేందుకు వెళ్లారు. పనులు ముగించుకుని అదే ఆటోలో శివరాంపురానికి బయలుదేరారు. మార్గంమధ్యలో దొడ్డవరం వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో దేవదాసు( 60), ఎరజాని మరియమ్మ, పేరమ్మలకు తీవ్రగాయాలు కాగా 108లో రిమ్స్కు తరలించారు. చికిత్స పొందుతూ దేవదాసు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మద్దిపాడు ఎస్సై ఫిరోజ్పాతిమా ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రత్యేకహోదా హామీని విస్మరించిన బిజెపి

### మతోన్మాద చర్యలతో రాజకీయాలు
### వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా
### మూడ్రోజుల ఆందోళన
### మీడియాతో సిపిఎం కార్యదర్శి మధు

విజయవాడ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ప్రత్యేక హోదా, విభజన హామీలను విస్మరించి రాష్ట్ర ప్రయోజనాలకు బీజేపీ దెబ్బకొట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ తెచ్చిన రైతాంగ వ్యతిరేక చట్టాలకు నిరసన తెలిపామని, దానికి కొనసాగింపుగా ఈ నెల 29, 30.. అక్టోబర్ 1 వ తేదీల్లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరసన దీక్షలకు పిలుపునిస్తున్నామని తెలిపారు. బిజెపి మతోన్మాద చర్యలు పక్కన పెట్టాలన్నారు. ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు కావాలని నాడు చెప్పిన బీజేపీ.. అన్ని హమీలను పక్కన పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్రంలో అంతర్వేది ఘటనను ఉపయోగించుకుని రాష్ట్రంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇదే బీజేపీ పార్లమెంట్లో రైతాంగ వ్యతిరేక బిల్లులు చేస్తోందని, కరోనా వైపరీత్యాన్ని ఉపయోగించుకుని ఒక వైపు ఆర్థిక రంగంలో కార్పొరేట్ల ప్రయోజనానికి.. మరో వైపు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాష్ట్రంలో బలపడడానికి చూస్తోందని విమర్శలు గుప్పించారు. సీఎం వైఎస్ జగన్ను సాధించాలని బీజేపీకి టీడీపీ వత్తాసు పలుకుతుందని ఆయన ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు సిగ్గు విడిచి మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మధు నిప్పులు చెరిగారు. పవన్ కల్యాణ్ ప్రత్యేక హోదా, విభజన హామీలపై మడమ తిప్పి బీజేపీ పక్కన చేరాడు. సోము వీర్రాజు రాష్ట్రంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. అంతర్వేది ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. ఇల్లు తగులబెట్టి బొగ్గులు ఏరుకునే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. దేశంలో రైతాంగ ఉత్పత్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని ప్రధాని మోదీ చూస్తున్నారు. గాంధీని చంపిన ఈ బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదాన్ని రెచ్చగొట్టాలని చూస్తోందని' ఆయన ఆరోపించారు. అక్టోబర్ 2న గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా శాంతియుతంగా పోరాడే వారికి వామపక్షాలు మద్దతిస్తున్నాయని' మధు తెలిపారు.

## నకిలీ వైబ్సైట్లను అరికట్టేందుకు టీటీడీకి షిర్డీ సంస్థాన్ సరికొత్త ప్రతిపాదన

తిరుమల, సెప్టెంబర్ 26 : నకిలీ వెబ్లైట్లను అరికట్టేందుకు షిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సరికొత్త ప్రతిపాదనను టీటీడీ ముందుంచింది. దేశంలోని అన్ని ప్రముఖ హిందూ దేవాలయాలు తమ వెబ్సైట్లో మిగిలిన ఆలయాల సైట్ల వివరాలను పొందుపరచాలని ప్రతిపాదించింది. ఈ మేరకు ప్రతిపాదనను పరిశీలించాలని టీటీడీ పాలకమండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం అన్నమయ్య భవనంలో టీటీడీ ఉన్నతాధికారులు, షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ అధికారుల బృందంతో ధర్మకర్తల మండలి చైర్మన్ సమావేశం నిర్వహించారు.కరోనా కట్టడికి జాగ్రత్తలు తీసుకుంటూ భక్తులకు దర్శనం కల్పిస్తున్న నేపథ్యంలో ఇక్కడ అధికారులు తీసుకుంటున్న చర్యలు పరిశీలించేందుకు సంస్థాన్ అధికారులు తిరుమలకు వచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో కొవిడ్ పరిస్థితుల్లో తిరుమలలో భక్తులకు కల్పిస్తున్న దర్శనం, వసతి, క్యూలైన్ల నిర్వహణ, అన్నదానం, శ్రీవారి సేవ, అకౌంట్స్, లడ్డూ ప్రసాదం కౌంటర్ల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్తో అవగాహన కల్పించారు. అలాగే టీటీడీ నిర్వహిస్తున్న సామాజిక, ధార్మిక కార్యక్రమాలను వివరించారు. చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా నిర్వహిస్తున్నామని, ఎలాంటి లోపాలు లేకుండా సంప్రదాయం ప్రకారం వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# స్వచ్ఛంధ సేవలో టిఆర్కె బేష్

## -తమకూ భాగస్వామ్యం కల్పించండి
## ముందుకు వస్తున్న పల్లె ప్రజలు

వేములవాడ, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి):టి ఆర్ కె సేవలో మేము సైతం అంటూ... పట్టణం నుండే కాకుండా గ్రామాల నుండి సేవకులు స్వచ్ఛందంగా



టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ లో చేరేందుకు వస్తున్నారు.

చందుర్తి మండలం ఎన్గల్

గ్రామం నుండి 50మంది యువకులు నిరుపేదలకు సేవ చేసేందుకు స్వచ్ఛందంగా టి ఆర్ కే ట్రస్ట్ లో వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్నారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సేవలు పట్టణంలోనే కాకుండా మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు ప్రతి గ్రామం నుండి సేవకులు స్వచ్ఛందంగా వేములవాడ లోని టి ఆర్ కే ట్రస్టు కార్యాలయానికి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అర్హతగల ప్రతి నిరుపేదలకు టి ఆర్ కె ట్రస్ట్ సేవలు ఉంటాయన్నారు.

అనంతరం ట్రస్టులో చేరిన యువకులు మాట్లాడుతూ అర్హత గల నిరుపేదలకు మా వంతు సహాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, టి.ఆర్.కె వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# గానగంధర్వుడికి అశ్రునివాళి



వేములవాడ, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో టి ఆర్ కె ట్రస్ట్ ఆధ్వర్యంలో గానగంధర్వుడు , బహుముఖ ప్రజ్ఞాశాలి , బహుభాషా నేపథ్య గాయకులు స్వర్గీయ ఎస్ పి బాల సుబ్రహ్మణ్యం మృతి పట్ల అశ్రునివాళి అర్పించారు .బాలు చిత్రపటానికి టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట రామ్ కుమార్ పూలమాలలు వేసి 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు .

ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం మరణం తీరనిలోటుగా అభివర్ణించారు . పాటకు పట్టం కట్టి , తెలుగు గొప్పతనాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన తెలుగు గాయకుల్లో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని , ధృవతారగా మిగిలిపోతారన్నారు . భౌతికంగా ఆయన దూరమైన పాటగా ఎప్పటికీ మనతోనే ఉండిపోతారని , ఆయన పాటకు మరణం లేదన్నారు . కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు . ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు . ఈ కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ మెట్టల మహేష్,కార్యదర్శి నాయిని శేఖర్ , సభ్యులు పాల్గొన్నారు .

# ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు

వేములవాడ, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి)చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలో ని తెలంగాణ చౌక్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి రజక సంక్షేమ సహకార సంఘం ఆధ్వర్యంలో పులా మాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కుల, మతాల కతీతం గా బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన చిట్యాల ఐలమ్మ జీవితం నేటి సమాజానికి ఆదర్శంగా ఉందని అన్నారు.

తెలంగాణ వీర వనిత ఐలమ్మ జయంతి ,వర్ధంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని , హైదరాబాద్ టాంక్ బండ్ ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మంగ్యారీ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి శ్రీనివాస్ బాలయ్య, రమేష్, చింతల తాడెం వెంకటేష్, అంజయ్య, మర్రిపల్లి రాజు, శ్రీకాంత్, రాజు, మైలారం లక్ష్మన్, కమలాకర్, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు..

# యువకుడు దారుణ హత్య

వేములవాడ, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి) వేములవాడ ప్రతినిధి వేములవాడ పట్టణంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఘర్షణలో పుదారి శ్రీనివాస్ గౌడ్ (52సం) హత్యకు గురయ్యారు.



పట్టణానికి చెందిన కొరేపు రాజు, శ్రీనివాస్ గౌడ్ మధ్య తలెత్తిన విభేదాలు తలెత్తడంతో కో రేపు రాజు గొడ్డలితో దాడి చేయగా... శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు.హుటాహుటిన వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్ గౌడ్ మృతిచెందాడు.

ఘర్షణ గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటేష్ తెలిపారు

## బాసరలో ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు

నిర్మల్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): బాసర మండల కేంద్రంలో ఈ రోజు తెలంగాణ భూస్వామ్య వ్యతిరేక పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. బాసర రజక సంఘ సభ్యులు ఈ సందర్భంగా ఐలమ్మకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన ఘనత ఆమెకే చెందుతుందని అన్నారు.అలాగే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని రజకులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాసర రజక సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.